క్లుప్తంగా

ముగిసిన అవగాహన కార్యక్రమాలు


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

నింద్ర: బాలింతలు, గర్భవతులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని నగరి ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం ఉన్నత పాఠశాలలో పౌష్టికాహార మాసోత్సవాల్లో ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లల పెరుగుదల యుక్తవయస్సు అమ్మాయిలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. బాలింతలు, గర్భవతులకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం విలువలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు డైరీలు పంపిణీ చేశారు. ఎంఈఓ వసుమతి దేవి, శ్రీధర్‌రాజు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ రేవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయండి


పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

విజయపురం: మండలంలోని కోసలనగరం ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తోపాటు శుక్రవారం కోసలనగరంలోని ఏపీఐఐసీ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం తమిళనాడు అంబత్తూరు ఇండస్ట్రియల్ మ్యానుఫాక్చరింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ ప్రాంతాల్లో ఫ్యాక్టరీలు ఏర్పాటుకు అవసరమైన సదుపాయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ఇప్పటికే సుమారు 2 వేల ఎకరాలకు పైగా ఏపీఐఐసీకి కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సంస్థకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

స్కూల్‌గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్‌గేమ్స్‌లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.కళావతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరిలోని పీసీఎన్ ప్రభుత్వ పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆరిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సి.ప్రియా, కె.కీర్తన, కె.కావ్య వాలీబాల్ అండర్-14లో జిల్లా స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు లోకనాథం, ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు బాలాజీ, చంద్రశేఖర్, బాబు, పద్మశ్రీ, సరోజమ్మ, జానకి, సత్య, అరుణకుమారి, ప్రసన్నకుమారి, మహేష్ తదితరులు అభినందించారు.

విజయపురంలో చిరుజల్లులు

విజయపురం: మండలంలో రెండు రోజులుగా చిరుజల్లులు పడుతుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకొంటున్నాయి. ఇప్పటికే విజయపురం, జగన్నాథపురం, పన్నూరు, మాధవరం, కాళికాపురం, గంగమాంబపురం తదితర గ్రామాల్లో వరి సాగు చేయగా ఆలపాకం, స్వామిరెడ్డికండ్రిగ, ఆముగుంట, తెల్లగుంటలో వరి సాగుకు సిద్ధమవుతున్నారు.

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటరమణ

పాలసముద్రం: మండలంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పారిశుధ్యం లోపించకుండా, దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సతీష్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ప్రత్యేక అధికారి వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో కురుస్తున్న వర్షాలకు ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ చేరితే అందులో దోమలు వృద్ధి చెంది, పలు రోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పారిశుధ్య పనులను మెరుగు పరుచుకోవాలని తెలిపారు. తాగునీటికి క్లోరినేషన్ తప్పనిసరని అన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలతో స్నేహభావంతో మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి సత్యనారాయణ, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం కండ్రిగలో మల్లె తోట


పూల మొగ్గలను కోస్తున్న కూలీలు

మల్లెలు.. లాభాల సుగంధం

పాలసముద్రం: పూజల్లో మల్లెపూలు విరివిగా వాడుతారు. మల్లెలతో తైలం కూడా తయారు చేస్తారు. రోజురోజుకూ మల్లెల ధర పెరుగుతోంది. రైతుకు లాభాలు అందిస్తున్నాయి. మంచి దిగుబడి, ధరలు దక్కాలంటే మల్లెలను ఇప్పటి నుంచే సాగు చేయడం మేలు. ఇప్పుడు నాటుకుంటే మాఘమాసం, పెరటాశి, కార్తీక పూజల సమయానికి మల్లెలు విరబూస్తాయి. పెళ్లిళ్లు, శుభకార్యాలు కూడా ఆ సమయంలో మెండుగా ఉంటాయి. పూలకు మంచి గిరాకీ లభిస్తుంది. పైగా మల్లెపూలు దిగుబడికి అనువైన సమయం. నియోజకవర్గంలో మల్లెపూలు వందల ఎకరాల్లో సాగవుతున్న నేపథ్యంలో రైతులు మల్లె సాగు చేయాల్సిన పద్ధతులు. చీడపీడల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ పలు జాగ్రత్తలను వివరించారు. నియోజకవర్గంలో ముఖ్యంగా విడిమల్లి, దొంతరమల్లె, గుండు మల్లె, బొడ్డు మల్లె రకాలను రైతు లు సాగుచేస్తున్నారు. మల్లెను తేలికపాటి నేలల్లో జూన్ నుంచి డిసెంబర్ వరకు ఎప్పుడైనా నాటు కోవచ్చు. పండే కాలం, డిమాండ్ దృష్ట్యా మల్లెను ఇప్పుడు నాటుకోవడమే ఉత్తమం. కొమ్మ కత్తిరింపు లేదా అంటు మొక్కల ద్వారా గానీ మల్లెను నాటుకోవచ్చు. పాలసముద్రం వ్యవసాయాధికా ఢిల్లీప్రసాద్, సలహాలు పాటిస్తూ, చీడపీడలు, తెగుళ్లను నివారించుకుంటూ ముందు కెళితే మంచి లాభాలు పొందవచ్చు.

చీడపీడలు.. నివారణ చర్యలు

- **మొగ్గ తొలుచు పురుగు లక్షణాలు:** ఈ పురుగు లార్వా పువ్వులోకి చొచ్చుకుపోయి పూల భాగాలను తినేస్తూ తీవ్రదశలో మొగ్గలన్నింటినీ ఒక దగ్గరికి చేర్చి ముడుచుకుపోయేలా చేస్తుంది.
- **నివారణ:** లార్వా ఆశించిన మల్లె మొగ్గలను ఏరివేసి నాశనం చేయాలి. రాత్రిపూట దీపపు పురుగులు పెట్టి, రెక్కల పురుగులను ఆకర్షింప చేసి నాశనం చేయాలి. మల్లె తోటను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సరైన పద్ధతిలో కొమ్మ కత్తిరింపులు చేయాలి. 5 శాతం వేపగింజ కషాయం లేదా మలాథియాన్ లేదా క్వినాల్‌ఫాస్ మందును లీటరు నీటికి 2మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. లేదా ప్రోఫినోఫాస్ 2 మి.లీ సైప్రోప్రోసాద్ 0.5 మి.లీ లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.
- **మడ్డి ఈగ లక్షణాలు:** మల్లె మొగ్గ రక్షక పత్రాల మొదలు వద్ద మడ్డి ఈగ యోగట్ రంధ్రం చేసి మొగ్గలోకి ప్రవేశించి లోపలి భాగాలను తింటాయి. ఈ ఈగ ఆశించిన మొగ్గలు గులాబీ రంగులోకి మారతాయి.
- **నివారణ చర్య:** థయోమిథాక్సిన్ 0.75 గ్రాములు లేదా ఫ్లూఫెనోక్సురాన్ 1.5 గ్రాములు లేదా నోవాల్యురాన్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **ఆకుగూడు పురుగు లక్షణాలు:** ఈ పురుగు లార్వా మల్లె ఆకులను ఒక చోటకు చేర్చి గూడుకట్టి ఆకుల్లోని పత్ర హరితాన్ని గోకి తింటుంది. వర్షాకాలంలో మొక్క కింద భాగం ఆకులను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తుంది. వేసవిలో మొక్కపై భాగంలో ఉండే ఆకులపై ఆశించి తీవ్రంగా నష్టపరుస్తుంది.
- **నివారణ:** ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ లేదా డైమిథోయేట్ 2మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

నల్లి లక్షణాలు: ఈ పురుగు ఉధృతి ముఖ్యంగా పొడి వాతావణంలో ఎక్కవగా ఉంటుంది. పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోతాయి. పురుగు ఆశించిన ఆకులు, మొగ్గలు, లేతకొమ్మలపై బొడిపెలు వస్తాయి. ఫలితంగా మొక్కలు గిడసబారి, మొక్క నుంచి మొగ్గల ఉత్పత్తి, సామర్థ్యం తగ్గుతుంది.

నివారణ: నల్లి ఆశించిన మొక్క భాగాలను పెరికి నాశనం చేయాలి. డైక్రోఫాల్(18.5ఈసీ) 3మి.లీ లేదా నీటిలో కరిగే గంధకం 50 డబ్ల్యూపీ(5గ్రా.లీ)ను పిచికారీ చేయాలి.

మల్లెలో తెగుళ్లు

- **ఆకు ఎండు తెగులు:** ఈ తెగులు ఆశించిన ఆకులు దళసరిగా మారుతాయి. ఆకు పైభాగంలో ఎరుపు మచ్చలు ఏర్పడుతాయి. తీవ్రదశలో 50 శాతం వరకు దిగుబడి తగ్గుతుంది.
- **నివారణ చర్యలు:** మాంకోజెబ్ 3 గ్రామ్ లేదా కార్బండిజమ్ 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మెళకువలు


ఢిల్లీప్రసాద్

అంటు మొక్కలు నాటుకోవాలనుకున్నప్పుడు మొక్కకు మొక్కకు మధ్య 25 మీటర్ల వెడల్పు, 200 మీటర్ల పొడవు ఉండేలా చూసుకోవాలి. మల్లె లేత చిగుర్ల నంచి పూలు వస్తాయి. ప్రతి ఏడాది డిసెంబర్-జనవరి మాసాల్లో మొక్కలను ఆకులను మనమే రాల్చాలి. కొమ్మలను కత్తిరించాలి. కొమ్మల కత్తిరింపునకు 10 నుంచి 15 రోజుల ముందు నీరు పెట్టడం ఆపేయాలి. కత్తిరింపుల తరువాత నీటి తడులు ఇస్తే మొక్కలు కొత్తగా చిగురిస్తాయి. అవసరాన్ని బట్టి 8 నుంచి 10 రోజులకు ఒకసారి తడి ఇవ్వాలి. ప్రతి మొక్కకు 8 నుంచి 10 కిలోల పశువు ఎరువు అందించాలి. 60 నుంచి 20 గ్రామల నత్రజని.1120 గ్రామలు భాస్వరం, పొటాష్ ఎరువులను మొదటి కొమ్మ కత్తిరింపు చేసిన వెంటనే వేయాలి. పూల దిగుబడి పెంచేందుకు లీటరు నీటికి 2.5 గ్రాముల జింక్‌సల్ఫేట్, 5గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ సూక్ష్మధాతువులను కలిపి రెండు, మూడు దఫాలుగా పిచికారీ చేయాలి.

వైభవంగా గ్రామ దేవత శక్తిపీఠం ప్రతిష్ట

నింద్ర: మండలంలోని అగరం గ్రామ పంచాయతీలో నూతనంగా గ్రామదేవత శక్తి పీఠం ప్రతిష్టించారు. బుధవారం ప్రారంభమైన వేడుకలు శుక్రవారం ముగిశాయి. గత రెండు రోజులుగా గ్రామంలో హోమం, కలశపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం వేదపండితుల మధ్య శక్తి పీఠానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ నడిబొడ్డున ప్రతిష్టించారు. గ్రామ సరిహద్దుల్లో చిన్న పాటి శక్తి పీఠం ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన శక్తి పీఠం కాలం చెల్లడంతో నూతనంగా ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

పండ్ల తోటల్లో సస్యరక్షణపై శిక్షణ


రైతులకు మందులు పంపిణీ

నగరి: సకాలంలో పండ్ల తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చునని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్, శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం నగరి మండలం ఎం.కొత్తూరు గ్రామంలో పండ్ల తోటలు-సస్యరక్షణపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మామిడిని ఆశించే రసం పీల్చే పురుగులు, కాండం తొలిచే పురుగుల నివారణకు మూడు నుంచి నాలుగు పర్యాయాలు పురుగు మందులు, తెగుళ్ల మందులు పిచికారీ చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు నివారణపై తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాఘవేంద్ర, లయశ్రీ, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

అధికార గర్వంతో అనుచిత వ్యాఖ్యలు


రమాదేవి

పాలసముద్రం: నకిలీ మద్యం తయారీకి వ్యతిరేకంగా పోరాడుతున్న జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మిపై టీడీపీ ఎమ్మెల్యే థామస్ చేసిన వ్యాఖ్యలను వైఎస్‌ఆర్ సీపీ పాలసముద్రం మహిళా అధ్యక్షురాలు రమాదేవి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ డాక్టర్ థామస్ అధికార గర్వంతో మహిళను ఆమె ధరించే చీర, ఆమె వేసుకుంటున్న బంగారం గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అవినీతికి తావులేని నాయకుడిగా ఐదు సంవత్సరాలు ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేశారన్నారు. అటువంటి కుటుంబంలో పుట్టి పెరిగిన నాయకురాలు కృపాలక్ష్మిని కించపరిచే మాటలు మాట్లాడితే అంతా చీకొడుతున్నారని తెలిపారు. టీడీపీ నాయకులే ఎమ్మెల్యే చేస్తున్న అరాచకాలను చూసి ధర్నాలు, నిరసనలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేసి వైఎస్ ఆర్ సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఇక ఊరుకోమని హెచ్చరించారు.

గిరిజన కాలనీలో వసతులు కల్పించాలి


మున్సిపల్ కార్యాలయం వద్ద గిరిజనుల ఆందోళన

పుత్తూరు: మున్సిపాలిటీ 27వ వార్డు బొజ్జనెత్తం ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దళిత, గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి వై.నందయ్య మాట్లాడుతూ బొజ్జనెత్తం ఎస్టీ కాలనీలో తాగునీరు లేక గ్రామస్తులు దుర్భర జీవితం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి, పారిశుధ్యం సౌకర్యాలు లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. కాలువల్లో పూడికలు తీయక ఏళ్లు గడుస్తుండడంతో దుర్వాసన, దోమలతో సహజీవనం చేయాల్సి వస్తోందన్నారు. గ్రామంలో పిల్లలు డెంగీ, టైఫాయిడ్ తదితర విష జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలిపారు. మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కి పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గంగాధరం, వెంకటేశు, చెంగల్రాయులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

భూముల వివరాలు తెలియజేయండి


వివరాలు కోరుతున్న కన్నియప్పన్, తిరుమలరెడ్డి

నగరి: ముడిపల్లి గ్రామ పరిధిలో భూభాగం, ప్రభుత్వ భూముల విస్తీర్ణం వివరాలు తెలియజేయాలని కోరుతూ శుక్రవారం వైస్ ఎంపీపీ కన్నియప్పన్, వైఎస్ఆర్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్టీఐ కింద వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ నగరి మండల పరిధిలోని సాగు భూమి విస్తీర్ణ వివరాలు సైతం అడిగినట్లు తెలిపారు. అలాగే ముడిపల్లిలో గ్రావెల్ క్వారీకి అనుమతులు ఎవరి పేరు మీద ఇచ్చారో తెలియజేయాలని విన్నవించినట్టు తెలిపారు. నగరి మండలంలోని అటవీ భూముల వివరాలు సైతం అడిగినట్లు వెల్లడించారు. నగరి మండలం వీకేఆర్‌పురం పంచాయతీ పరిధిలో ఏపీఐఐసీకి ఎంత భూమిని స్వాధీనపరిచారో తెలియజేయాలని కోరినట్లు తెలిపారు. పరిశ్రమల కోసం ఏపీఐఐసీకి స్వాధీన పరచిన డీకేటీ, పట్టా భూములకు రైతులకు అందించిన అక్విటెన్స్ రిపోర్ట్ ఇవ్వాల్సిందిగా కోరినట్లు తెలిపారు. సదరు భూమిలో మైనింగ్‌కి సంబంధించి ఎవరికైనా అప్పగించి ఉంటే తెలపాలని కోరినట్లు వెల్లడించారు.

సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి


వెదురుకుప్పంలో ఎమ్మార్పీఎస్ నేతల ధర్నా

వెదురుకుప్పం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) చిత్తూరు జిల్లా జనరల్ సెక్రటరీ సూరపాకం యువరాజు మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వెదురుకుప్ప మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడిని ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగం మీద దాడిగా పరిగణించాలన్నారు. న్యాయమూర్తి గవాయ్ దళితుడు కావడాన్ని కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేక పోవడంతోనే అహంకారపూరితంగా దాడికి తెగబడ్డాడని మండిపడ్డారు. సుప్రీంకోర్టులో ప్రజాస్వామిక వాదులుగా గుర్తించబడ్డ సీనియర్ న్యాయమూర్తులతో విచారణ చేయించాలని, అదే క్రమంలో ఇలాంటి సంఘటనలు మరో మారు పునరావృతం చర్యలు చేపట్టాలని వారు కోరారు. అనంతరం వెదురుకుప్పం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్మన్న, ముని, తీపినూరు వాసు, లోకనాథం, సర్పంచ్ వెంకటముని, తిరుమలయ్య, సతీష్, హరి, సురేష్ మాదిగ, రూపేష్ మాదిగ, భాను మాదిగ, వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శి మంజునాథ్, వినాయక మాదిగ, చిరంజీవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పాలసముద్రం: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ సతీష్‌కుమార్, ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. శుక్రవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విచ్చేసిన మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడంతో మాతాశిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తాయని తెలిపారు. అనంతరం అందరూ కలసి బాల్య వివాహాలు చేయరాదని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు శరవణన్, మునిరాజ్, రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలపై కూటమి కుట్ర

- కోటి సంతకాల సేకరణ కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ
- సమన్వయకర్త కృపాలక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే థామస్ క్షమాపణ చెప్పాలి
- వైఎస్‌ఆర్ సీపీ మండల అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి, ఎంపీపీ అనిత డిమాండ్


కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ

గంగాధరనెల్లూరు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వైఎస్‌ఆర్ సీపీ గంగాధరనెల్లూరు మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎంపీపీ అనిత కోరారు. మండల పరిధిలోని వింజం పంచాయతీ శ్రీసిద్ధేశ్వర స్వామి కొండ గ్రామంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేఆర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకువచ్చి దాదాపు ఐదు మెడికల్ కాలేజీల్లో ప్రస్తుతం వైద్య విద్య నిర్వహిస్తున్నారని, 7 మెడికల్ కాలేజీలు భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తున్న నేపథ్యంలో ఆ ఆలోచనలు మానుకోవాలని వైఎస్‌ఆర్ సీపీ పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పంపించి, గవర్నర్‌కు అందిస్తామని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అనిత, గుణశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, హరిబాబు, ఏకాంబరం, ఢిల్లీకుమార్, వింజం గోవిందయ్య, హనీఫ్ బాషా, చంద్రారెడ్డి, వెంకటేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, దినేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కృపాలక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



వైఎస్‌ఆర్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మిపై కూటమి ఎమ్మెల్యే థామస్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. మహిళ కట్టుబొట్టుపై కూడా మాట్లాడడం కూటమి ఎమ్మెల్యేకి సరికాదు. వారి ఇంటిలో కూడా ఆడవాళ్లు ఉంటారని, ఇలా దళిత నాయకురాలిపై పరుష పదజాలంతో అవమానకర రీతిలో మాట్లాడే మాటలు మంచి పద్ధతి కాదు. వెంటనే కృపాలక్ష్మికి, మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలి. -అనిత, ఎంపీపీ, జీడీనెల్లూరు

నిరాధార ఆరోపణలు నిరూపించాలి



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మిపై కూటమి ఎమ్మెల్యే థామస్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. నియోజకవర్గంలో కృపాలక్ష్మి ప్రతి సమస్యలపై పోరాడుతుండడంతో ఓర్వలేక బురదజల్లే కార్యక్రమాలు మానుకోవాలి. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై చేస్తున్న ఆరోపణలకు కూటమి ప్రభుత్వం సీబీఐ ఎంక్వయిరీ జరిపించాలి. ప్రతిపక్ష పార్టీలపై కుట్రలతో చేస్తున్న బురదజల్లే కార్యక్రమాలు, అవమానకర రీతిలో మాట్లాడుతున్న మాటలు నియోజకవర్గ ప్రజలందరూ గమనిస్తున్నారు. -వెంకటేష్‌రెడ్డి, జిల్లా బూత్ కన్వీనర్

ఏరులై పారుతున్న కల్తీ మద్యం



గ్రామాలలో మినరల్ వాటర్ ప్లాంటుల్లా కుటీర పరిశ్రమలు ఏర్పాటుచేసి కల్తీ మద్యం తయారు చేసి, వేలాది లీటర్లు బెల్ట్ షాపుల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్న కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం మంచి పద్ధతి కాదు. గ్రామాలలో చిన్నచిన్న షాపులలో కూడా అన్నివేళలా మద్యం దొరుకుతూ ఏరులై పారుతోంది. ప్రభుత్వం వెంటనే బెల్ట్ షాపులపై కఠిన చర్యలు చేపట్టి బెల్ట్ షాపులలో మద్యం అమ్మకాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా. -హరిబాబు, వైస్ ఎంపీపీ

ఎమ్మెల్యే అమానుష వ్యాఖ్యలు తగదు



గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలలో మహిళలకే పెద్దపీట వేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వంలో మహిళలను అవమానకర రీతిలో మాట్లాడటం మంచి పద్ధతి కాదు. మా దళిత నాయకురాలైన కృపాలక్ష్మి చీరలు, నగలపై ఎమ్మెల్యే థామస్ కామెంట్లు చేయడం క్షమించరాని తప్పు. వైఎస్‌ఆర్ సీపీ సమావేశాలకు డబ్బులకు మహిళలను తీసుకువస్తున్నారనడం అవమానకరం. గత ప్రభుత్వంలో జగనన్న చేసిన మంచికే మహిళలంతా కల్తీ మద్యంపై పోరాటానికి వచ్చాం. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ కోరాలి. -చిన్నమ్మ, కట్టకిందపల్లి గ్రామం, జీడీనెల్లూరు

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ


ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో అధ్యాపక బృందం

పుత్తూరు: క్రమశిక్షణకు మారుపేరు నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) అని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎన్‌సీసీకి ఎంపికైన 28 క్యాడెట్స్‌ను శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా సామాజిక సేవ, జాతీయ భావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన వారికి బహుళ ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, పోలీసు శాఖలో అత్యధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్‌సీసీకి ఎంపికైన ప్రతి ఒక్కరూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, 29 ఆంధ్ర బెటాలియన్‌కు చెందిన సుబేదార్ ఎస్‌కే సింగ్, సుబేదార్ పి.చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.